క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ సహకారంతో అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం, పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వీరఘట్టం, పార్వతీపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొనగా, హోమంలో పాల్గొనడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. అలాగే దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

నేడు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం

పాలకొండ: మండల కేంద్రంలో నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన సాయంత్రం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం..

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలతో పాటు రావివలస గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో ఆరో తరగతి, ఏడో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బిడ్డిక రూప ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి, ఆరో తరగతిలో 40 సీట్లు, ఏడో తరగతిలో 1 సీటు, ఇంటర్మీడియెట్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్)లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో గానీ పాఠశాలను నేరుగా సంప్రదించి గానీ దరఖాస్తులు అందించవచ్చన్నారు.

జలవిహార్‌లో చేపల వేట


జలవిహార్‌లో పట్టిన చేపలు

సీతంపేట: వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమంలో భాగంగా స్థానిక అడ్వంచర్ పార్కులో ఉన్న జలవిహార్‌లో చేపల వేట గురువారం చేపట్టారు. 150 కిలోల చేపలను పట్టగా, ఇందులో 10 నుంచి 15 కిలోల బరువున్న చేపలు కూడా లభించాయి. వాటిని కిలో రూ.150కి చొప్పున విక్రయించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో డబ్బీరు గోపీకృష్ణ, ఫిషరీస్ అసిస్టెంట్ విజేత తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించుకోవాలి


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

పాలకొండ: గ్రామాల్లోని సామాజిక మరుగుదొడ్లు వినియోగించుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ కోరారు. మండలంలోని వెలగవాడ గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన గ్రామంలోని సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రుద్రిపేట గ్రామ రోడ్డును వెలగవాడ గ్రామస్తులు బహిర్భూమికి వినియోగిస్తున్నారన్న ఫిర్యాదు స్పందన కార్యక్రమంలో వచ్చిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆయన ఆ రోడ్డుపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ రోడ్డుపై బహిర్భూమికి వెళ్తే రూ.500 జరిమానా అని ఆ బోర్డులో రాసి ఉండడం గమనార్హం.

వివాదాల జోలికి పోవద్దు


గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ ప్రసాద్

భామిని: ఎన్నికల నేపథ్యంలో ఎవరూ వివాదాల జోలికి పోవద్దు అని, అందరూ కలిసిమెలసి ఉండాలని బత్తిలి ఎస్ఐ చిట్టిపోలు ప్రసాద్ అన్నారు. మండలంలోని నేరడి–బి గ్రామంలో గ్రామస్తులతో గురువారం సమావేశమైన ఆయన మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరుగుతాయని, ఆ పార్టీ.. ఈ పార్టీ అని తగాదాలకు పాల్పడవద్దని సూచించారు. ఎవరైనా గొడవలకు దిగితే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



- వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


కార్యక్రమానికి హాజరైన మహిళలు (ఇన్‌సెట్లో) వైఎస్సార్ చేయూత పథకం నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మహిళల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం దగ్గరలో గురువారం జరిగిన వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అక్కచెల్లెమ్మలంతా బాగుండాలన్నదే ఆయన తపన అని అన్నారు. మహిళల సంక్షేమానికి అనేకానేక పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తున్నారన్నారు. ఇప్పుడు వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత నిధుల పంపిణీ కూడా చేయడం జరిగిందని, ఈ మేరకు మండలంలోని 5,548 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10.40 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.40.88 కోట్లను మండలంలోని లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా నాయకులు, అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ సీపీనే రానున్న ఎన్నికల్లోనూ గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని అసత్యాలను ప్రచారం చేసి, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఘోర ఓటమి తప్పదని, వైఎస్సార్ సీపీ భారీ విజయం ఖాయమని జోస్యం చెప్పారు. అనంతరం వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత నిధుల నమూనా చెక్కును మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఇదిలా ఉండగా, లబ్ధిదారులంతా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, థాంక్యూ సీఎం సార్.. థాంక్యూ జగనన్న అని నినాదాలు చేసి, కృతజ్ఞత చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, మహిళా విభాగం కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ జయప్రకాష్, ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం శివన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే గిరిజనాభివృద్ధి

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు


కురుపాం : శిలాఫలకం ఆవిష్కరించి, గొటివాడ బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

కురుపాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వారు కలిసి గురువారం ప్రారంభించారు. ప్రారంభించిన వాటిలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన గొటివాడ బీటీ రోడ్డు, సచివాలయ భవనం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లతో పాటు, పాడి–ఒప్పంగి రోడ్డు, జి.శివడ–మద్దుగూడ, మద్దుగూడ–నాంద్రగండ, గుజ్జువాయి, వై.కొత్తగూడ, నీలకంఠాపురం–నాయుడుగూడ, నీలకంఠాపురం–కొత్తగూడ రోడ్లు ఉన్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని, ఈ నాలుగున్నరేళ్లలో ఎన్నో ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అనేకానేక పథకాలతో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కురుపాం నియోజకవర్గంలో దశాబ్దాలుగా పాలించిన టీడీపీ నేతల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఈ విషయాన్ని ప్రజ లు గుర్తించాలన్నారు. జగనన్న ప్రభుత్వం ద్వారా ప్రతీ కుటుంబానికి లబ్ధి జరిగిందన్నారు. ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో ఇంటింటికీ వస్తున్న టీడీపీ నేతలను నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం ఖాయమని, టీడీపీకి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. అందరి బాగోగుల కోసం పాటుపడుతున్న సీఎం జగనన్నకు మనమంతా అండగా నిలవాలని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


జియ్యమ్మవలస: బల్లేరు–బల్లేరుగూడ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని బల్లేరు నుంచి బల్లేరుగూడ వరకు రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన తారురోడ్డు, బల్లేరు నుంచి బండిగూడకు రూ.1.50 కోట్లతో నిర్మించిన తారురోడ్డును ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలోనే గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని, మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం రోడ్లు వేసిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానిదేనన్నారు. మనం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కడ్రక బలరాం, సర్పంచ్ నిమ్మక గణేష్, నాయకులు మరడాన కిశోర్, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో అదనపు ఆదాయం


విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖాధికారి రేఖ

గరుగుబిల్లి: వ్యవసాయ ఉత్పత్తులకు విలువ ఆధారిత ఉత్పత్తులను జోడిస్తే అదనపు ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖాధికారి ఇ.రేఖ అన్నారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో విలువ ఆధారిత ఉత్పత్తులపై గురువారం అవగాహన కల్పించారు. మన గ్రామం–మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు, జాతీయ సేవా పథకం(ఎన్.ఎస్.ఎస్) కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా, అరటికాయలతో చిప్స్, మొక్కలకు అంటు కట్టే విధానం తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.తవిటినాయుడు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి హరిరామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య తనిఖీలు


రోగుల నేత్రాలు తనిఖీ చేస్తున్న వైద్యుడు జాక్సన్

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి సత్యసాయి బాబా మందిరం ఆవరణలో ఉచిత నేత్రవైద్య శిబిరం గురువారం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, ఆశయ హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరానికి గరుగుబిల్లి, రావుపల్లి, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి 74 మంది రోగులు హాజరు కాగా, వారికి వైద్యుడు జాక్సన్ నేత్రవైద్య తనిఖీలు నిర్వహించి, 30 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరందరికీ విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషణ్ పక్వాడా ర్యాలీ చేపట్టి, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొమరాడ: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణ కుమారి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడా కార్యక్రమం జరుగుతుందని, రక్తహీనతను అరికట్టడమే కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులను ఆరోగ్యవంతులుగా ఉంచేలా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజ్ఞాన మేళా

సీతంపేట: మండలంలోని కీసరజోడు గ్రామంలో వెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక, విజ్ఞానమేళా గురువారం నిర్వహించారు. పూర్వపు ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలు ఎలా ఉండేవి అనే విషయాలను ఈ కార్యక్రమంలో తెలిపారు. కార్యక్రమంలో వెలు గు సిబ్బంది బి.వెన్నల, మిన్నారావు, సుహాసిని, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ సీనియర్ నేత రాజశేఖరం

పాలకొండ: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ బొమ్మాళి శ్రీనివాసరావు కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పాలవలస రాజశేఖరం చేతులమీదుగా గురువారం అందజేశారు. ఇటీవల సదరు వలంటీర్ మృతి చెందగా, అతడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యేలా ఎమ్మెల్సీ విక్రాంత్ చొరవ తీసుకున్నారు. ఈ మేరకు విడుదలైన నిధులను చెక్కు రూపంలో శ్రీనివాసరావు తల్లి సింహాచలం..కు అందించారు. కార్యక్రమంలో ఏజీపీ చందక జగదీష్‌కుమార్, అల్లు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం..


భామిని: వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు ప్రసాద్, నూకయ్య

భామిని: మండలంలోని రేగిడికి చెందిన బిడ్డిక గంగన్న ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య సతితకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు బిడ్డిక ప్రసాద్, బిడ్డిక నూకయ్య మాట్లాడుతూ మిగతా రూ.90 వేలను నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నల్లరాయిగూడ సర్పంచ్ బిడ్డిక గోయింది, సచివాలయ కార్యదర్శి ఎస్.శంకరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


కురుపాం: అభిలాష గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు

కురుపాం: యువత, విద్యార్థులంతా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మొండెంఖల్ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు కోరారు. మండలంలోని మొండెంఖల్ గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన అభిలాష గ్రంథాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం అపారమైన జ్ఞానం లభిస్తుందన్నారు. ఇక్కడి పోటీ పరీక్షల పుస్తకాలను నిరుద్యోగ యువతీయువకులు ఉపయోగించుకుని, ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతీ విద్యార్థి, యువతీయువకులంతా రోజులో ఓ గంటకాలాన్ని గ్రంథాలయానికి కేటాయించి, పుస్తకాలు చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుడారి విద్యారాణి, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ బి.ఆనంద్, స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ ఇందిరాకుమారి తదితరులు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట అభిలాష గ్రంథాలయంలో యువతకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ చైతన్య

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం–1లో కొత్తగా ఏర్పాటు చేసిన అభిలాష గ్రంథాలయాన్ని సర్పంచ్ ఆర్.ఎస్. చైతన్య స్రవంతి గురువారం ప్రారంభించారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రత్యేక చొరవతో ప్రారంభించిన ఈ సామాజిక గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. విజ్ఞానం పంచే పుస్తకాలతో పాటు కథలు, పోటీ పరీక్షల పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి


వినతిపత్రాలు స్వీకరిస్తున్న విద్యుత్ వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

పాలకొండ రూరల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్ వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బి.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా విద్యుత్ సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తమకు తెలియజేయాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వవచ్చన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

మంత్రి బొత్సకు ఘనస్వాగతం


మంత్రి బొత్స సత్యనారాయణతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

పాలకొండ: మండల కేంద్రంలో మంత్రి బొత్స సత్యనారాయణకు ఘనస్వాగతం లభించింది. గురువారం వీరఘట్టం మండలంలోని కిమ్మి–రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై కొత్తగా నిర్మించిన వంతెనను ప్రారంభించేందుకు వెళ్తున్న ఆయన పాలకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పాలవలస రాజశేఖరం ఇంటికి వెళ్లగా, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి వందలాది కార్లుతో ర్యాలీగా కిమ్మి గ్రామం చేరుకుని, వంతెన, ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు.

ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని చిన్నదిమిలికి చెందిన ఎస్.సుశీలమ్మ(60) ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం కలిసి, పరామర్శించారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు కొవ్వాడ చిరంజీవులు, మాజీ జెడ్పీటీసీ కొవ్వాడ దశాలు, రైతు సలహా సంఘం అధ్యక్షుడు వలరౌతు రవణమ్మ, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, సర్పంచ్ లోతుగెడ్డ రవికుమార్, పార్టీ అధ్యక్షుడు తోట సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించండి

బలిజిపేట: రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ–1సామల సింహాచలం విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గురువారం ఆయన తగు సూచనలు అందించారు. ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న పరీక్షలలో విద్యార్థులు మానసిక ధైర్యంతో రాయాలని పిలుపునిచ్చారు. ప్రీ ఫైనల్ పరీక్షలలో ఏవిధంగా పరీక్షలు రాశారో అదేవిధంగా రాయాలని, కొత్తవాటిని చదువుకోకుండా ఇంతవరకు చదువుకున్న పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ చదువుకు పది పరీక్షలే పునాది అని స్పష్టం చేశారు.

పోలీసుల కవాతు

జియ్యమ్మవలస: రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అవగాహన కల్పిస్తూ మండలంలోని నిమ్మలపాడు నుంచి సీమనాయుడువలస మీదుగా కన్నపుదొరవలస వరకు పోలీసులు గురువారం కవాతు చేపట్టారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.


కవాతు ప్రదర్శనలో పోలీసులు